ప్రజాశక్తి



బుధవారం 22 అక్టోబరు 2025 | 5 | శ్రీకాకుళం

పిపిపి విధానాన్ని అడ్డుకుంటాం

ప్రజాశక్తి - మెళియాపుట్టి : వైద్య కళాశాలల ప్రైవేటీకరణ పేరుతో ప్రజలను ప్రైవేటు ఆస్పత్రులకు అప్పగించే పిపిపి విధానాన్ని ప్రజలతో కలిసి అడ్డుకుంటామని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కరజాడలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యక్షతన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఆరోగ్యశ్రీని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే సుక్క పగడాలమ్మ, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ జయమునిరావు, పల్లి యోగి, ఉల్లాన బాలరాజు, సర్పంచ్ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సేకరణ సాఫీగా సాగేనా..?

- ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తం
- ఖరీఫ్‌లో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- జిల్లావ్యాప్తంగా 406 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- నవంబరు మొదటి వారంలో కేంద్రాల ప్రారంభం

వరి పంట మరికొద్ది రోజుల్లో చేతికొచ్చే అవకాశం ఉండడంతో ధాన్యం సేకరణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం కొత్తగా కొన్ని మార్పులను తీసుకొచ్చింది. తేమ శాతం నిర్ధారించేందుకు గతంలో రైతు సేవా కేంద్రాలు, మిల్లుల్లో వేర్వేరు పరికరాలను వినియోగించగా, ఈ ఏడాది రెండింటిలోనూ ఒక కంపెనీకి చెందిన పరికరాలను ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయాన్ని అరికట్టేందుకు కొత్త రకం యాప్ తీసుకురానున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఏటా ధాన్యం కొనుగోలులో అవకతవకలపై పూర్తి సమాచారాన్ని రాబట్టుకున్న ప్రభుత్వం, ఈసారి అటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని భావిస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



ధాన్యాన్ని లారీకి లోడ్ చేస్తున్న రైతులు (ఫైల్)

ఈ ఖరీఫ్‌లో 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగు అయినట్లు వ్యవసాయశాఖ అధికారులు పౌర సరఫరాల సంస్థ అధికారులకు వివరాలు అందించారు. జిల్లాలో ఈ ఏడాది పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగిలిన ధాన్యాన్ని ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి రైతులకు అవసరమైన సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కొనుగోలు చేయాల్సిన ధాన్యం కోసం జిల్లావ్యాప్తంగా 406 కేంద్రాలను అధికారులు గుర్తించారు. ఎప్పటిమాదిరిగానే రైతుసేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లు, డిసిఎంఎస్‌లు, వెలుగు, జిఇసి (గవర్నమెంట్ ఎంప్లాయిస్ సెంటర్స్)ల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) కోసం 267 మిల్లులకు పంపనున్నారు.

ఈ-క్రాప్ ఆధారంగానే వరి కొనుగోలు

జిల్లాలో ఈ ఏడాదీ పంటల ఈ-క్రాప్ ఆధారంగానే ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీనిపై ఇటీవల రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఎపి రైతు, కౌలురైతు సంఘాలు అనేక సమస్యలను ప్రస్తావించారు. భూ విస్తీర్ణాల్లో వ్యత్యాసాలు, కౌలు రైతులు సాగు చేస్తున్నా, వారి పేరుతో వివరాలు నమోదు కావడం వంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. దీంతో ధాన్యం కొనుగోలులో రైతులకు సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిసి 4.91 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. అందులో 4.40 లక్షల వరకు ఈ-క్రాప్ పూర్తయింది. వరి 3.80 లక్షల ఎకరాల్లో సాగు కాగా, అందులో 40 వేల ఎకరాల వరకు ఈ-క్రాప్ పెండింగ్‌లో ఉంది. పంటల ఈ-క్రాపింగ్‌కు ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉంది. అది పూర్తయిన తర్వాత నవంబరు మొదటి వారంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

వ్యయప్రయాసలు తప్పేనా?

ధాన్యం తరలింపులో నాలుగేళ్లుగా రైతులకు వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. ఆన్‌లైన్ పద్ధతిలో ఒక మండలంలోని రైతులకు వేర్వేరు మండలాల్లోని మిల్లులకు ధాన్యం కేటాయించేవారు. ఒక మండలంలోని రైతు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలోని మిల్లులకు ధాన్యాన్ని తరలించే పరిస్థితి ఉండేది. వీటితోపాటు ఆన్‌లైన్ ఇబ్బందులు, అన్‌లోడింగ్ సమస్యలతో రైతులు దళారుల వైపే మొగ్గు చూపేవారు. ధాన్యం అమ్మకంలో రూ.200 నుంచి రూ.300 పోయినా ఇన్ని ఇబ్బందులు ఎవరు పడతారంటూ కమీషన్ ఏజెంట్లకే అమ్ముకునేవారు. దీంతోపాటు అదనంగా రెండు, మూడు కేజీలు ధాన్యం తీసుకునేవారు. ఈ ఖరీఫ్‌లో ఈ రకమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం చెప్తోంది.

యాప్‌తో దళారుల నియంత్రణ జరిగేనా?

వరికి సాధారణ రకానికి క్వింటాకు రూ.2,360, ఎ-గ్రేడ్ రకానికి రూ.2,380 ధర నిర్ణయించింది. తేమ, పొల్లు పేరుతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ధాన్యం కొనడానికి నిరాకరిస్తున్న సందర్భంలో దళారులు రంగప్రవేశం చేయడం, వాటిని రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేయడం, మళ్లీ వాటిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే అప్పగించడం వంటి అవకతవకలు ఏటా జరుగుతున్నవే.

వీటిపై దృష్టిసారించిన ప్రభుత్వం, ఈ ఏడాది దళారుల నియంత్రణకు కొత్త రకం యాప్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. యాప్ ద్వారా దళారుల వివరాలను అందిస్తే, ప్రభుత్వం వారిపై కేసులు నమోదు చేయనుందని అధికారులు చెప్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇది ఎంతవరకు విజయవంతమవుతుందనేది చూడాల్సి ఉంది.



పోస్టల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

మా డబ్బులు ఎప్పుడు ఇస్తారు?

- పోస్టల్ కార్యాలయం వద్ద ఖాతాదారుల ఆందోళన
- సిబ్బంది విధులకు హాజరు కాకుండా అడ్డగింత
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో ఆర్థిక అవకతవకల కారణంగా ఖాతాదారులకు చెల్లించాల్సిన డబ్బులు మూడు నెలలైనా చెల్లించకపోవడంతో బాధితులు కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఉదయానికే పోస్టల్ కార్యాలయానికి చేరుకున్న బాధిత ఖాతాదారులు గేటుకు అడ్డంగా బైఠాయించి సిబ్బందిని విధులకు హాజరు కాకుండా అడ్డుకున్నారు. తమ డిపాజిట్లు చెల్లించాలని నినాదాలు చేశారు. పోస్టుమాస్టర్ జి.షణ్ముఖరావు బాధితులకు నచ్చజెప్పినా వినకపోవడంతో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆయన అక్కడకు చేరుకుని చాలాసేపు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమ డబ్బులు ఫలానా తేదీ నాటికి అందజేస్తామని లిఖితపూర్వకంగా ఇస్తే ఆందోళన విరమిస్తామని బాధితులు స్పష్టం చేశారు. తాను అలా ఇవ్వలేనని చెప్పి... పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, సూపరింటెండెంట్ హరిబాబుకు ఫోన్‌లో విషయాన్ని వివరించారు. అందరికీ న్యాయం చేస్తామని, ఒక్క పైసా కూడా పోదని ఎడి రాజు ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పంపించారు.

తమకు వాయిస్ మెసేజ్‌లు వద్దని నేరుగా కార్యాలయం వద్దకు రావాలని, లేదంటే బాధితులతో ఫోన్‌లో మాట్లాడాలని పట్టుబట్టారు. కార్యాలయానికి రాలేకపోతే బాధితులతో ఫోన్‌లో మాట్లాడాలని ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.హైమ డిమాండ్ చేశారు. దీంతో పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు ఫోన్‌లో మాట్లాడి 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో బాధితులు ఆందోళనను విరమించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆందోళన కొనసాగడంతో, అంతవరకు పోస్టల్ అధికారులు బయటే నిల్చొన్నారు. బాధితులు ఆందోళన విరమించాక కార్యాలయానికి వెళ్లారు.

23 కేటగిరీల్లో ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆర్‌టిసిలో 23 కేటగిరీలకు చెందిన పలు ఉద్యోగులకు ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ తెలిపారు. ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు ఇచ్చే ప్రక్రియ జిల్లా ఉద్యోగోన్నతుల కమిటీ ఆధ్వర్యంలో పూర్వ ప్రాంతీయ మేనేజర్ కార్యాలయం, విజయనగరంలో పూర్తి కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 264 మందితో పాటు మరో 38 మంది (10 శాతం రిజర్వ్) మొత్తం 302 మంది ఉద్యోగులకు రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. సీనియారిటీ, రిజర్వేషన్ రోస్టర్ మేరకు ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటిలో క్వాంటమ్ ఉత్సవం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో 'క్విసిక్ ఫాల్ ఐబిఎం క్వాంటమ్ ఉత్సవం-2025' అట్టహాసంగా మంగళవారం ప్రారంభమైంది. ఈ ఉత్సవాన్ని ఐబిఎం క్వాంటమ్ సలహాదారు డాక్టర్ ఎల్.వెంకట సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మంచి భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఐబిఎం క్వాంటమ్, క్వాంటమ్ కంప్యూటింగ్ కార్యక్రమాల్లో ప్రపంచ ఖ్యాతి గాంచిన క్విసిక్ ఫాల్ ఉత్సవాన్ని ఈ సంవత్సరం నిర్వహించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 55 విద్యాసంస్థల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి ఒకటిగా నిలవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవంలో విద్యార్థులకు క్వాంటమ్ సాంకేతికతపై అవగాహన పెంచడం, క్విస్కిట్ నైపుణ్యాలను మెరుగుపరచడం లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఆచరణాత్మక వర్క్‌షాప్‌లు, మార్గనిర్దేశంతో కూడిన జూపిటర్ నోట్‌బుక్‌లు, ప్రాంగణ హ్యాకథాన్‌లు, క్వాంటమ్ పరిశోధనపై నిపుణుల ఉపన్యాసాలు ఉంటాయని వివరించారు. క్వాంటమ్ ఉత్సవానికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి ఎంపిక కావడంపై విశాఖ ఎంపీ, గీతం విశ్వవిద్యాలయం అధినేత భరత్ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ నాయకులుగా ఎదగాలని, తద్వారా మన ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకట ధన బాలాజీ మాట్లాడుతూ ఇది తమ విద్యాలయానికి లభించిన గొప్ప అవకాశమన్నారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఆర్థిక అధికారి వాసు, సమన్వయకర్తలు రవి, కంప్యూటర్ శాస్త్ర విభాగపతి రమేష్, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోలీసులకు అండగా ప్రభుత్వం

- శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్ర కీలకం
- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజల రక్షణ విధుల్లో ప్రాణాలు సైతం పణంగా పెట్టి శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేసే కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పోలీసులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.ఆర్ మహేశ్వర రెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఎన్.ఈశ్వరరావుతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. సమాజ రక్షణ, భద్రత కోసం పోలీసు సిబ్బంది అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. గంజాయి, మాదకద్రవ్యాలు అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన ఆరు వేలమందికి త్వరలోనే నియామక పత్రాలను అందజేయనున్నట్లు వెల్లడించారు.

పోలీసుల్లేకుండా ప్రగతి లేదు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ పోలీసులు లేకుండా ప్రగతి లేదన్నారు. జిల్లా పోలీసులు ప్రకృతి వైపరీత్యాలు, ఉత్సవాలు, శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. త్వరలోనే కారుణ్య నియామకాలపై దృష్టిసారిస్తామన్నారు.

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న భారత్, చైనా సరిహద్దుల్లో దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళ్లర్పిస్తూ పోలీసు అమరవీరుల దినోత్సవంగా ఏటా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో విధినిర్వహణలో ఐదుగురు పోలీసులు ఎస్.బంగారు నాయుడు, ఎ.పాపారావు, ఎం.నరేంద్రదాస్, ఎం.వెంకటరమణ, పి.కృష్ణమూర్తి అమరులయ్యారని, వారి సేవలను గుర్తుచేశారు. పోలీసులు ప్రజల్లో గౌరవం, అభిమానం పొందేలా విధులు నిర్వర్తించాలన్నారు. ఈనెల 31వ తేదీ వరకు సంస్మరణ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

అనంతరం జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమరవీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన 191 అమరవీరుల పేర్ల పుస్తకాన్ని మంత్రి ఎస్‌పికి అందజేశారు. ఎఎస్‌పి కె.వి రమణ పుస్తకంలో పేర్లను చదివి వినిపించారు. అనంతరం ఓపెన్ హౌస్‌ను ప్రారంభించిన అతిథులు జిల్లా పోలీసుల ఆయుధ సంపత్తిని తిలకించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, డిఎస్‌పిలు వివేకానంద, లక్ష్మణరావు, శేషాద్రి, సిఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్‌పి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

రైతులు భూములు త్యాగం చేయాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

రైతులు తమ భూములను త్యాగం చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. భూములు ఇవ్వబోమంటే పరిశ్రమలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. జీడి ఉత్పత్తిపై రైతులు, వ్యాపారులు, ఉద్యాన, బ్యాంకు అధికారులతో స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమలు రావాలంటే వ్యాపారులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. భూములు ఇవ్వబోమని ర్యాలీలు, ధర్నాలు చేస్తే ఏ పరిశ్రమలూ రావన్నారు. ఈ కారణంగానే జిల్లాలో వలసలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. పలాస నియోజకవర్గంలో కొత్త పారిశ్రామికవాడలో 60 ఎకరాల్లో వ్యాపారులకు స్థలాలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులు జీడిపంట పండించే విధానంలో, వ్యాపారులు తయారు చేసే విధానంలో మార్పు ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇతర దేశాల వంగడాలతో అధిక దిగుబడులు సాధిస్తున్నారని, అటువంటి వంగడాలు మనం వేసుకుంటే అధిక ఉత్పత్తి సాధించగలమన్నారు.

టిడిపి సమన్వయకర్త వెంకన్నచౌదరి మాట్లాడుతూ అధికంగా జీడి పంట సాగవుతున్న మహారాష్ట్రకు 50 మంది రైతులను పరిశీలనకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, మల్లా రామేశ్వరరావు, డోకి నాగేశ్వరరావు, శాసనపురి మురళి మాట్లాడుతూ ఇక్కడి పిక్కలు ఉత్పత్తి, నాణ్యత లేకపోవడం వల్లే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని చెప్పారు. పంట సాగు విధానం, నాణ్యతలో మార్పులు తీసుకురావాలన్నారు. జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, రైతులు బి.కళ్యాణ చక్రవర్తి, దాసరి తాతారావు తదితరులు మాట్లాడుతూ ఉద్యానశాఖ అధికారులు రైతులకు సూచనలు ఇవ్వడం లేదన్నారు. వాణిజ్య పంటగా జీడికి గుర్తింపు లేకపోవడం వల్లే మద్దతు ధర రావడం లేదన్నారు. సమావేశంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఉద్యానవనశాఖ ఎడి చంద్రశేఖరరావు, పిసిఎంఎ కార్యదర్శి, కోశాధికారి టి.రవిశంకరుగుప్తా, మల్లా సంతోష్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, లేబర్ యూనియన్ నాయకులు అంబటి కృష్ణమూర్తి, వ్యాపారులు, రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గూగుల్‌ని రానీయకుండా జగన్ కుట్ర

- అభివృద్ధిపై వైసిపి నేతలు చర్చకు రావాలి
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సవాల్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విశాఖకు గూగుల్ రానీయకుండా జగన్ కుట్రలు పన్నుతున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గూగుల్‌పై కర్నాటక ఐటి మంత్రి, జగన్ ఒకరి తర్వాత ట్వీట్‌లు చేయడం వెనుక అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. బెంగుళూరులోని జగన్ ప్యాలెస్ వేదికగా ఈ కుట్ర సాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా అవి నెరవేరవన్నారు. ప్రభుత్వం మంచి చేస్తే వాటిని ఆహ్వానించడం, తప్పులు ఉంటే నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిన జగన్, ఆయన పార్టీ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలపై మాట్లాడేందుకు వేదికగా ఉన్న అసెంబ్లీకి రాకుండా జగన్ తాడేపల్లిలోని గదిలో కూర్చొని విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి సిఎంగా పనిచేసి, ఒక పార్టీకి అధ్యక్షునిగా ఉన్న జగన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 16 నెలల్లో చేసిన అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. చర్చకు కూటమి నుంచి ఎవరైనా వస్తామని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందని విమర్శించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో దివాలా తీసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దేశీయ కంపెనీలతో పాటు విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. విశాఖలో త్వరలో నిర్వహించే పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు తర్వాత రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు సిద్ధమవుతుందని, ఉత్తరాంధ్రలో అభివృద్ధితో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని చెప్పారు. గూగుల్‌కు మాత్రమే రాయితీలు ఇవ్వడం లేదని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఏ పరిశ్రమకైనా ప్రభుత్వం భూములు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తుందని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. సమావేశంలో డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, నాయకులు అన్నెపు భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

రిమ్స్‌ను మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని (రిమ్స్) అన్ని వసతులతో కూడిన మోడల్ హాస్పిటల్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని రిమ్స్ బోధనాస్పత్రిని మంగళవారం పరిశీలించారు. తొలుత ఒపి విభాగానికి వెళ్లి రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ పథకంలో భాగంగా ఒపిలో రోగుల వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి ఉద్దేశించిన ట్యాబ్‌లను సిబ్బందికి పంపిణీ చేశారు. అనంతరం ఇంటెన్సివ్ కేర్, గైనిక్ విభాగాన్ని సందర్శించారు. ఎన్‌పిసిఎల్ సిఎస్ఆర్ నిధులు రూ.40 లక్షల విలువైన లాప్రోస్కోపిక్, హిస్టెరోస్కోపిక్ పరికరాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తితో కలిసి మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చేపట్టే అన్ని నియామకాల విషయంలో రోస్టర్ విధానాన్ని, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా, పారదర్శకంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఒపిలో సీనియర్ వైద్యులు కూడా అందుబాటులో ఉండాలని, అన్ని విభాగాల్లో వైద్యులను షిఫ్ట్ పద్ధతిలో కేటాయిస్తూ డ్యూటీ ఛార్ట్ ప్రదర్శించాలని సూచించారు. సర్జరీల సంఖ్యను పెంచాలన్నారు. ఆస్పత్రిలో లిఫ్ట్ పనిచేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి, వైద్యం కోసం వచ్చే రోగులను మెట్లు ఎక్కించడం తగదని, తక్షణమే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు.

మంత్రి దృష్టికి సమస్యలు

రిమ్స్ జనరల్ ఆసుపత్రి ప్రత్యేక అధికారి, జాయింట్ డైరెక్టర్ బుడితి రాజశేఖర్ ఆసుపత్రిలోని సమస్యలను మంత్రి దష్టికి తీసుకువచ్చారు. 2014-19 మధ్య సుమారు రూ.60 కోట్లతో నిర్మించిన భవనాలు ఫర్నిచర్ లేకపోవడంతో వినియోగంలోకి రాలేదని తెలియజేయగా, తక్షణమే రూ. 2 కోట్లు మంజూరు చేయుటకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు. నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ గుర్తింపు కోసం మౌలిక వసతులు మెరుగుపరచాల్సి ఉందని రాజశేఖర్ తెలిపారు. ఎమర్జెన్సీ విభాగంలో పడకల సంఖ్యను పెంచాలని కోరారు. ఆసుపత్రిలో శానిటేషన్, డ్రైనేజీ వ్యవస్థ, మెడికల్ కళాశాల ఆసుపత్రిలో కమ్యూనికేషన్ వ్యవస్థలను మెరుగుపరచాలన్నారు. గత సమీక్ష సమావేశాల మినిట్స్‌ను తదుపరి సమావేశంలో తప్పక ఉంచాలని, గతసారి మినిట్స్ అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగుపురం వద్ద నర్సింగ్ కాలేజీని పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ అప్పలనాయుడు, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఎం-23 జీడిని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి- కవిటి

కంబోడియాలో సాగవుతున్న ఎం-23 రకం జీడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రోత్సహించాలని రైతులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పిఒ అధ్యక్షుడు ఆరింగి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో విస్తారంగా జీడిపంట సాగుచేస్తున్నారని తెలిపారు. కానీ, దిగుబడిలో, నాణ్యతలో సమస్యలు ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అదే సమయంలో కంబోడియాలో ఎం-23 రకం జీడి సాగుచేస్తూ అక్కడ రైతులు మనకంటే మూడు రెట్లు అధిక దిగుబడులు సాధిస్తున్నట్టు తెలిపారు. అదే ఎం-23 రకం ఉద్యానశాఖ అధికారులతో మాట్లాడి మన ప్రాంతానికి అనుగుణంగా సిద్ధం చేస్తే రైతులకు మంచి ఆదాయం వస్తుందని అన్నారు. అదే సమయంలో వ్యాపారులూ ఇతర ప్రాంతాల నుంచి జీడి దిగుమతులు మానేసి నాణ్యమైన మన జీడిపప్పుకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ఇటీవల ఎపిఇడిఎ, ఎఐసిఎ ఆధ్వర్యాన భారత ప్రతినిధి బృందం కాంబోడియాలో పర్యటించి ఎం-23 రకం జీడిపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని ఇటు రైతులకు, అటు వ్యాపారులకు లాభసాటిగా ఉన్న ఎం-23 రకం జీడిని అటు ప్రభుత్వం, ఇటు ఉద్యాన శాఖ అధికారులతో సమర్ధించి మన రాష్ట్రంలో ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో బెందాళం విజయ్ కృష్ణ, పూర్ణ, బల్లెడ జయప్రకాష్, బెందాళం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు .

తూర్పుకాపు సంక్షేమ సంఘం యువజన అధ్యక్షునిగా వెంకట్


వెంకట్

పొందూరు: జాతీయ తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ యూత్ అధ్యక్షునిగా మండలంలోని లోలుగుకు చెందిన లోలుగు వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమ సంఘం మహాసభ ఎన్నికలో వెంకట్ ఎన్నికయ్యాడు. తెలుగు యువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న వెంకట్ తూర్పుకాపు సంక్షేమ సంఘంలో నిర్వహించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. తనను రాష్ట్ర తూర్పుకాపు సంక్షేమ సంఘం యూత్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్న రాష్ట్ర సంఘం సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపాడు.

క్రీడా విజేతలకు బహుమతులు

సంతబొమ్మాళి: మీరా యువ భారత్ సౌజన్యంతో సంతబొమ్మాళి మండల కేంద్రంలో నిర్వహించిన క్లస్టర్ లెవల్ క్రీడా పోటీల్లో విజేతలకు సోమవారం మండల పిఎసిఎస్ అధ్యక్షులు కూచెట్టి కాంతారావు, ఎస్ఐ వై.సింహాచలం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.


బహుమతులు అందజేస్తున్న కాంతారావు

దళితులపై వివక్ష చూపితే చర్యలు

ప్రజాశక్తి- కంచిలి

ఒకే గ్రామంలో ఉంటున్న దళిత కుటుంబాలపై ఏ విధమైన వివక్ష చూపితే చట్టపరమైన చర్యలు తప్పవని కంచిలి ఎస్ఐ పారినాయుడు హెచ్చరించారు. మండలంలోని జిల్లుండకు చెందిన కొందరు దళిత కుటుంబాల సభ్యులు తమపై, గ్రామంలో కొందరు వివక్ష చూపుతున్నారని, తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో సమానంగా చూడటం లేదని, తాగునీటి బావి వద్ద తమ కుటుంబాలకు చెందిన మహిళలను దూరంగా ఉంచుతున్నారంటూ మంగళవారం మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ పారినాయుడు, ఎంపిడిఒ వి.తిరుమలరావు, తహశీల్దార్ ఎన్.రమేష్ మంగళవారం గ్రామానికి వెళ్లి, విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పిర్యాదు చేసిన కుటుంబాలతోపాటు, గ్రామ పెద్దలతో మాట్లాడారు. కొద్ది రోజులుగా తమ ఏడు కుటుంబాలను గ్రామంలోని కొందరు దూరం పెడుతున్నారని దళిత కుటుంబాల సభ్యులు ఆరోపించారు. ముఖ్యంగా తమ పిల్లలను స్థానిక అంగన్వాడీ కేంద్రంలో దూరంగా ఉంచుతున్నారని, ఆలయాల లోపలకి ప్రవేశం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు గ్రామ పెద్దలతో మాట్లాడారు. అయితే తామెవరిపైనా వివక్ష చూపడం లేదని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. ఇటువంటి చర్యలు సరికాదని, ఇకపై అందరూ ఒకరితో ఒకరు కలిసిమెలసి మెలగాలని అధికారులు సూచించారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే సంబంధిత వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు, రూ.2 లక్షలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వీటితోపాటు ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందన్నారు. విచారణలో దళిత సంఘ నాయకులు నగిరి మోహనరావు, జగ్గారావు, అంగన్వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు


సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఇటీవల టెక్కలి నియోజకవర్గంలోని కోటబొమ్మాళి, నందిగాం మండలాల పరిధిలో మూడు పిఎసిఎస్ చైర్మన్లను, సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో సోమవారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ల, సభ్యులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. రైతుల ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సకాలంలో రుణాలు, సకాలంలో విత్తనాలు అందేలా కృషి చేయాలన్నారు. అంతకుముందు స్థానిక టిడిపి కార్యాలయంలో పిఎసిఎస్ చైర్‌పర్సన్ వెలమల విజయలక్ష్మి, సభ్యులు సాసుమంతు ఆనంద్, సకాలభక్తుల రాంకుమార్‌లకు సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పూజారి శైలజ, కింజరాపు హరివరప్రసాద్, తర్ర రామకృష్ణ, నాళ్ల ఆదినారాయణ (చిన్ని), చల్ల సింహాచలం, చింతల సింహాచలం, కర్రి అప్పారావు, కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి, బాడాన రమణమ్మ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

వైద్యఖర్చులతో ఆర్థిక అవస్థలు పడుతున్న ప్రజానీకానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తంలా నిలుస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో సిఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాల్లో రూ.లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రతిఒక్కరూ తాము నివసించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ సూచించారు. మండలంలోని రాగోలులో ఐవిఆర్ఎస్ కాల్స్, చెత్త నుంచి సంపద కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ ప్రభుత్వం ప్రజల నుంచి ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా రోడ్లు, డ్రైనేజీలు, పరిశుభ్రత, నీటి సమస్యలపై తెలుసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా సమస్యలు తెలియజేస్తే తక్షణమే పరిష్కరించాలని పంచాయతీ సిబ్బంది ఆదేశించారు. ఎక్కడా చెత్తా చెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉండాలన్నారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వల ఉంటే దోమలు ఎక్కువ అవుతాయని, తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురవుతారని అన్నారు. ఈయనతో పాటు ఎంపిడిఒ ప్రకాశరావు, కార్యదర్శి తిరుమలాదేవి ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ

'పురమిత్ర' వినియోగంలో ప్రథమం

మున్సిపల్ కమిషనర్ రామారావు

పలాస : పురమిత్ర వినియోగంలో రాష్ట్రంలోనే పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ మొదటి స్థానంలో ఉందని కమిషనర్ నడిపేన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడి ప్రజలకు సాంకేతికతను వినియోగించుకోవడంలో పరిజ్ఞానముందని కితాబునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పురపాలక సేవలను సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పురమిత్ర' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో కంటే ఎక్కువ మంది హౌస్-హెరీల్డ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో 17790 కుటుంబాలుండగా, 6523 మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 412 ఫిర్యాదులు రాగా, వాటిని పరిష్కరించినట్లు స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబులు సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ఆర్‌టిసి బస్సులు

టెక్కలి : కార్తీకమాస మహోత్సవ సందర్భంగా పంచారామ క్షేత్రాలకు టెక్కలి ఆర్‌టిసి డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నామని మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటలకు సర్వీసులు బయలుదేరనున్నాయని తెలిపారు. పంచరామ క్షేత్రాల్లో భాగంగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట వంటి క్షేత్రాలను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ సర్వీసుకు 2,600, అల్ట్రా డీలక్స్ సర్వీసుకు 2,550 చొప్పున టిక్కెట్లను కేటాయించామన్నారు. ఈ అవకాశాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాసుదేవ్‌కు సముచిత స్థానం


వాసుదేవ్

కవిటి: అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ యువజన ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ప్రగడపుట్టుగకు చెందిన కొర్రాయి వాసుదేవ్ యాదవ్ ఎన్నికయ్యారు. ఇటీవల కాకినాడ యానాంలో నిర్వహించిన పుదుచ్చేరి, యానాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నర్తు రామారావు, జాతీయ ప్రధాన కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, జిల్లా యాదవ పెద్దలు వాసుదేవ్ యాదవ్‌ను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో బాధ్యతలు చేపట్టిన వాసుదేవ్ యాదవ్ తన సేవలతో యాదవ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వ్యర్థాల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ప్రవేశద్వారం వద్ద బాహుదా నది రోడ్డు వంతెన దాటిన తర్వాత బాహుదా బెల్లుపడా ఛానల్‌కి వెళ్లే మార్గంలో వ్యర్థపదార్థాలుచ బయో మెడికల్ వ్యర్థాలు, మాంసాహార వ్యర్థాల నివారణ చర్యల చేపట్టాలని నీటి సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ ముకుందరావు, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ అప్పలస్వామిలకు మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యర్థాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బెల్లుపడా ఛానల్, బాహుదా నదీ పరివాహక ప్రాంతాల్లో పట్టణంలో దుకాణాల వ్యర్థాలు, వివిధ ఆస్పత్రుల బయో మెడికల్ వ్యర్థాలు పారవేస్తున్నారని అన్నారు. దీంతో ఆ నీటి ప్రవాసంలో కలిసి నీటి పర్యావరణ కాలుష్యాన్ని కల్గించి ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కొచ్చెర్ల ధనుంజయరెడ్డి, డి.రామారావురెడ్డి, కొండ శంకర్‌రెడ్డి, తారకేసు రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నందిగాం కోటి, వై.రాజు, కృష్ణారావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

'ఐతమ్'లో ఆటో క్యాడ్‌పై శిక్షణ


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యాన ఆటో కాడ్ ఉపయోగించి బిల్డింగ్ డ్రాఫ్టింగ్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు మంగళవారం తెలిపారు. ఈ శిక్షణలో ఇంజినీరింగ్ సివిల్ విభాగం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. భవనాల ప్లాన్, ఎలివేషన్, ఐసోమెట్రిక్ వీక్షణల రూపకల్పన, బీమ్‌లు, స్తంభాల క్రాస్ సెక్షన్ డిజైన్లమెట్ల కేసు, క్రాస్ సెక్షన్ రూపకల్పనకు శిక్షణ పొందారన్నారు. కార్యక్రమానికి శిక్షకులుగా బి.దాలినాయుడు వ్యవహరించారని తెలిపారు. 'ఆటోకాడ్' వంటి సాంకేతిక నైపుణ్యాలు విద్యార్థుల్లో ప్రాజెక్టు రూపకల్పన సామర్థ్యాలను పెంచుతాయన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి శిక్షణలు విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్‌ఒడి డాక్టర్ పి.దినకర్, స్పొకె డాక్టర్ బి.రామారావు, సివిల్ విభాగ సమన్వయకర్త సాయిబాబులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమమ్మతులు, విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్న సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి ఏరియా, శ్రీనివాస నగర్, పాత జాతీయ రహదారి, మండల పరిషత్ కార్యాలయం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, పారిశ్రామిక వాడ, రోటరీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వినిపిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

రోడ్డు పైకి సాగునీరు

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం పెట్రోలు బంకు సమీపంలో రామతీర్థం రోడ్డుపై కల్వర్టు నిర్మాణం చేయాలని స్థానికులు ప్రజా ప్రతినిధులకు, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రామతీర్థం రోడ్డు కమ్మసిగడాం వద్ద కల్వర్టు లేదు. వర్షాలు కురిసే సమయంలో పోలాల నుంచి వరద నీరంతా రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో బురద మయంతో గోతులుగా మారింది. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బురదలో సర్కస్ ఫీట్లతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. సంవత్సరాల తరబడి కల్వర్టు నిర్మించమని పలుమార్లు విన్నవించినా పట్టించుకోని నాధుడే లేరని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.


రోడ్డుపై నుంచి పారుతున్న నీరు

నిండిన కనపల చెరువు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని మదనగోపాల సాగర జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి బీడు భూములు సస్యశ్యామలముగా మారాయి. మదన గోపాలపురం జలాశయం నుంచి రెండు పైపుల ద్వారా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి కొండల ప్రాంతంలోని మూడు పంచాయతీ పరిధిలోని 950 ఎకరాల భూమికి సాగునీరు అందిస్తున్నారు. దీంతో ఏటా కరువు కోరల్లో ఉన్న బీడు భూములు సస్యశ్యామలమయ్యాయి. శివారు భూములైన టెక్కలి, నందిగాం మండల పరిధిలోని మెట్టు ప్రాంతాలకు సాగునీరందించాలని ఉద్దేశంతో 2018లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ చూపారు. దీంతో టెక్కలి, నందిగాం మండలాల పరిధిలోని ఐదు పంచాయతీలకు సాగునీరు అందిస్తున్నారు. నందిగాం మండలంలోని రాంపురం, గొల్లూరు, సవరణ, నీలాపురం, బిల్లుకుల, రతజన, బొడ్డపాడు, చిన్నారిగోకర్లపల్లి, సొంటునూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు సాగునీరు అందుతుంది. చిన్నారిగోకర్లపల్లిలోని కనపల చెరువు నిండి కొండల తాండవిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


నిండుకుండలా కనపల చెరువు


మాట్లాడుతున్న ఎఒ మోహనరావు

త్వరితగతిన ఈ-క్రాప్ నమోదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో ఈ క్రాప్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ పంటల నమోదు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. లక్కుడుపేట, కట్యాచార్యులపేట, టి.జొన్నవలస, దూసి, చీమలవలస క్లస్టర్‌ల్లో పంట నమోదు శాతం 90 శాతానికి తక్కువగా ఉందని, క్లస్టర్లలో వెంటనే నమోదు శాతాన్ని పెంచి ఈ నెల 25 నాటికి శతశతం పూర్తిచేయాలని ఆదేశించారు.


ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొట్టి కావ్య, పైల నందిని, ఎస్.తులసి, గార చంద్రికలు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ఆటల పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో విజేతగా నిలిచారు. ఏలూరు జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఈనెల 21 నుంచి 23 వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. వీరికి ప్రధానోపాధ్యాయులు వై.మాలతి, పిఇటి ఇ.అప్పన్న, సర్పంచ్ వెంకట సీతారామరాజులు, కేశవసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ, పిఇటిలు సునీతలు అభినందించారు.

డిఎ జిఒను సవరించాలి

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఒక డిఎని మంజూరు చేస్తూ... జారీ చేసిన జిఒలను సవరించాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘం నాయకులతో మంత్రులు, అధికారులు, ముఖ్యమంత్రి చర్చించే సందర్భంలో ప్రస్తావనకు రాని అంశాలను డిఎకు చెందిన జిఒలో అధికారులు ప్రస్తావించడం సమంజసం కాదన్నారు. డిఎ జిఒ ద్వారా వచ్చే ఎరియర్స్ ఉద్యోగ విరమణ తర్వాత చెల్లిస్తామని చెప్పడంపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. సిపిఎస్ ఉద్యోగులకు సంబంధించిన అంశాన్ని జిఒలో ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. 2027-28 ఆర్థిక సంవత్సరంలో 12 వాయిదాల్లో బకాయిలు చెల్లిస్తామని చెప్పడాన్ని ఖండించారు. నాలుగు డిఎలు ఇవ్వవలసిన ప్రభుత్వం ఒక్క డిఎ మాత్రమే విడుదల చేయడం అన్యాయమని అన్నారు. ఆ డిఎ చెల్లింపుల్లోనూ గందరగోళాన్ని సృష్టించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా డిఎ జిఒలపై ప్రభుత్వం, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

అభాగ్యుల కళ్లల్లో ఆనందకాంతులు

ప్రజాశక్తి- కవిటి

దీపావళిని పటాకుల శబ్దాలతో కాదు, ఆనందకాంతులతో వెలిగించాలనే సంకల్పంతో హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా రోడ్డుకిరువైపుల నివసిస్తున్న నిరాశ్రయులు, వృద్ధులు, పేద కుటుంబాలకు దుప్పట్లు, ఆహారం, మిఠాయిలు, రొట్టెలు, తాగునీటి సీసాలు అందజేశారు. అకస్మాత్తుగా లభించిన ఈ మానవతా స్పర్శతో వారి ముఖాల్లో చిరునవ్వులు విరబూశాయి. కళ్లల్లో ఆనందకాంతులు మెరిపించాయి. దీంతో 'ఇంత సంతోషంగా దీపావళి ఎప్పుడూ నిర్వహించుకోలేద' అని పలువురు భావోద్వేగానికి గురయ్యారు. సమాజంలో సహాయానుభూతి, సేవా భావం పెంపొందించే దిశగా హెల్పింగ్ హాండ్స్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసలతో ముంచెత్తారు. కార్యక్రమంలో నందీప్, కాళీ, మేఘనాద్, కాళీ సాహు పాల్గొన్నారు.


అభాగ్యులకు కానుకలు అందిస్తున్న సభ్యులు

శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్


జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో గాజు సీసాలు, చెత్తాచెదారం పేరుకుపోయి, అటవీ ప్రాంతంగా మారిపోయింది. తద్వారా అక్కడ అంత్యక్రియల కోసం వచ్చే గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతుండడం గమనించిన గ్రామానికి చెందిన ఏరుసు శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రొక్లెయినర్ సాయంతో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. శ్మశాన వాటిక పరిసరాలను జంగిల్ క్లియరెన్స్ చేసి, గాజు సీసాలు, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించారు. గ్రామస్తులు శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛతపై ఆయన చూపిన చొరవ గ్రామ యువతకు ప్రేరణ కలిగించేలా ఉంది. గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కార్యక్రమంలో మారం వెంకటరావు, దున్న శ్రీనివాసరావు, శశిభూషణరావు, మనోజ్‌కుమార్, కృష్ణారావు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

గల్లంతైన యువకుడు మృతి


జగదీష్ (ఫైల్)

ప్రజాశక్తి- పొందూరు

గార మండలంలోని మొగదలపాడు వద్ద సముద్ర స్నానానికి ఈనెల 19న వెళ్లి కెరటాల తాకిడికి కొట్టుకుపోయిన పొందూరు మండలం కింతలి పంచాయతీ కాజీపేటకు చెందిన అలబోయిన జగదీష్ (18) మృతదేహం మంగళవారం శ్రీకూర్మం సమీపంలో లభ్యమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... ఈనెల 18న జగదీష్ తన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్నేహితులతో కలిసి సరదాగా సముద్ర స్నానానికి మొగదులపాడు బీచ్‌కు వెళ్లారు. అక్కడ సరదాగా స్నానం చేస్తుండగా అలలు తాకిడికి కొట్టుకుపోయాడు. రెండు రోజుల అనంతరం మంగళవారం శ్రీకూర్మం సమీపంలో మృతదేహం లభ్యమైంది. పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని తండ్రి గోవిందరావు, తల్లి గోపెమ్మలు భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. మృతుడు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఐటిఐలో చేరేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.


ఆస్పత్రిలో గుర్తు తెలియని మృతదేహం

గుర్తుతెలియని మృతదేహం

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో సుమారు 55 సంవత్సరాల వయసు ఉన్న ఓ వ్యక్తి అపస్మారక స్థితి పడిపోయాడు. ఆ వ్యక్తిని ఆదివారం రిమ్స్ చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆచూకీ తెలిస్తే శ్రీకాకుళం టూ టౌన్ సిఐ పి.ఈశ్వరరావు సెల్ నంబరు 6309990824ను సంప్రదించాలన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొత్తూరు: మండలంలోని మాతల కాలనీకి చెందిన ఇరింజల మురళి, ముప్పిడి శంకర్, తోట రామకృష్ణలపై మంగళవారం కేసు నమోదు చేశామని సిఐ చింతాడ ప్రసాద్ తెలిపారు. మాతలలో ఉన్న సాయిసూర్య రంగా ఎంటర్ప్రైజెస్ బాణసంచా షాపులోకి సోమవారం అదే కాలనీకి చెందిన వారు అక్రమంగా చొరపడి షాపులో ఉన్న జ్యోతిరంజన్ పట్నాయక్‌తో గొడవపడి కొట్టారని అన్నారు. పట్నాయక్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తు నిమిత్తం హెడ్ కానిస్టేబుల్ తిరుమలరావు, హోంగార్డు రవిలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ముగ్గురితో మాట్లాడరని అన్నారు. ఆ ముగ్గురు వ్యక్తులు దర్యాప్తు చేస్తున్న పోలీసులపైనా దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. దీనిపై మంగళవారం సిఐ, ఇన్‌ఛార్జి ఎస్ఐ చంద్రశేఖర్ దర్యాప్తు నిమిత్తం మాతల వెళ్లారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అర్జునవలస పంచాయతీ గిరివానిపాలెంకు చెందిన ఇంటర్ విద్యార్థిని ఈ నెల 19న అదృశమైందని ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. మండలంలోని కొండముల గాం మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతుందన్నారు. ఆదివారం స్నేహితులతో కలిసి పిక్నిక్‌కు వెళ్తున్నట్టు తల్లిదండ్రులకు చెప్పి వెళ్లిందన్నారు. ఇప్పటి వరకు వరకు ఇంటికి చేరకపోవడంతో ఆమె తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి అడగ్గా, పిక్నిక్ జరగలేదని అధ్యాపకులు చెప్పారని తెలిపారు. అక్కడి నుంచి ఇరుగుపొరుగు వారిని, అలాగే బంధువులు, స్నేహితులకు ఫోన్ల ద్వారా అడిగినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. దీంతో విద్యార్థిని తండ్రి కొచ్చెర్ల రమణ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని తెలిపారు.


బైక్‌పై పడిన విద్యుత్ స్తంభం

తప్పిన ప్రమాదం

వజ్రపుకొత్తూరు : మండలంలోని గరుడుభద్ర సమీపంలో ఉన్న రాజాం- గరుడభద్ర రోడ్డుపై విద్యుత్ స్తంభం పడిపోవడంతో అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కానీ, బైక్ ధ్వంసమైంది. వివరాల్లోకి వెళ్తే... చినవంక మాజీ సర్పంచ్ సానా కృష్ణ, పల్లిసారథికి చెందిన ఉప్పరపల్లి రామారావులు బైక్‌పై సోమవారం బొడ్డపాడు వెళ్తున్నారు. గరుడుభద్ర రహదారి వద్ద విద్యుత్ స్తంభంపై వారిపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై స్తంభం ఉండిపోవం, వారు ఆ కింద ఉండిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చుట్టు పక్కల ఉన్న వారు వచ్చి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయించి అనంతరం స్తంభాన్ని పక్కకు నెట్టారు. వెంటనే గాయపడిన ఇద్దరినీ పలాసలోని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై విద్యుత్ ఎఇ వెంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా ప్రైవేటు వ్యక్తులు గాలికి విరిగిన స్తంభం తరలించి ఉంటారని తెలిపారు.

గోదాము దగ్ధం

సోంపేట : పట్టణంలోని చలపతి గోర్జివీధిలో ఉన్న ఉన్న బత్తుల రుద్రయ్యకు చెందిన గొడౌన్ సోమవారం రాత్రి గద్దమైంది. ఈ ప్రమాదంలో విక్రయానికి ఉన్న సామగ్రి దగ్ధం కావడంతో రూ.4.50 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు సోంపేట అగ్నిమాపక అధికారి ఆర్.సూర్యారావు తెలిపారు. పట్టణానికి చెందిన రుద్రయ్య తాను చేసుకునే చిల్లర వ్యాపారాలకు సంబంధించిన వస్తువులను చలపతి గోర్జి లో ఒక ఇంటిలో నిల్వ ఉంచుతున్నాడు. దీపావళి పండగ సందర్భంగా ఆయా టపాసు కాయలు కాల్చే క్రమంలో తారాజువ్వలు పైకి వెళ్లి, ఇంటి గ్రిల్ లో పడి మొదట చీపురులకుని నిప్పు అంటుకొని క్రమంగా ప్లాస్టిక్ వస్తువులకు వ్యాపించిందన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది డి.భాస్కరరావు, సిహెచ్.విజయ్‌కుమార్, బి.బాబూరావు, ఎస్.పి.వెంకటరావు, ఎం.మహందాత పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న డిపిఎం సత్యనారాయణ

ప్రకృతి సాగు మెరుగుపడాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రృతి వ్యవసాయ సాగు మెరుగు పడాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు విస్తరణలో భాగంగా శ్రీకాకుళం వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం సాగు పరిస్థితిపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో పూరిస్తాయిలో అవగాహన అవసరమని చెప్పారు. రసాయన ఎరువులు, పురుగుల మందులు పూర్తిస్థాయిలో తగ్గించేలా వ్యవసాయం ముందుకు సాగాలన్నారు. రైతులకు వ్యవసాయ యాజమాన్య ఖర్చులు తగ్గుతాయని అన్నారు. క్షేత్రస్థాయిలో రబీ డ్రై షోయింగ్ పంటలు సాగు, పలు మోడల్స్ పద్ధతులు గురించి వివరించారు. ప్రకృతి సేద్య పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులను మార్కెట్ చేయడానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. రైతుల ఆదాయం పెంచడం, పెట్టుబడి తగ్గించడం, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి సాధించడం ప్రధాన లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయంలో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమానికి డిషనల్ డిపిఎం ధనుంజయ్ పాల్గొన్నారు.



పొందూరుపుట్టుగ

ఆ ఊరు దీపావళికి దూరం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని పొందూరుపుట్టుగలో ఈ ఏడాది దీపావళి వెలుగులు కనపడలేదు. సంతోషాల పండగగా మిగిలిన చోట్ల దివ్యదీపాల కాంతులు మెరిసినా ఈ గ్రామంలో మాత్రం చీకట్లు అలుముకున్నాయి. ఈనెల 16న సంభవించిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు దూగాన రామ్మూర్తి, ప్రణయ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన గ్రామాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. చికిత్సకు అవసరమైన నగదు సేకరణలో గ్రామస్తులు నిమగ్నమయ్యారు. దీంతో బాధిత కుటుంబానికి సంఘీభావంగా గ్రామస్తులంతా సోమవారం నిర్వహించిన దీపావళి పండగకు దూరంగా నిలిచారు. దేశమంతా వెలుగుజిలుగుల కాంతుల మధ్య ఆ గ్రామంలో మాత్రం అమావాస్య చీకట్లు కమ్ముకున్నాయి.




సూచనలు ఇస్తున్న సురేష్ కుమార్

కళాశాల ఆకస్మిక తనిఖీ

కవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యాధికారి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆర్.సురేష్ కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, అధ్యాపక సిబ్బందితో సమావేశమయ్యారు. విద్యా ప్రమాణాలు, 36 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సూచనలు ఇచ్చారు. 'నాడు-నేడు' భవనాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు, పచ్చదనం కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత శాతం పెంపునకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం కళాశాల సిబ్బంది సురేష్ కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.హరి, జి.విష్ణుమూర్తి, ఉగాది నాయుడు, శ్రీనుబాబు, పాపారావు, కరుణశ్రీ, జనార్ధనరావు, అంజన తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సర్వే



సర్వే చేస్తున్న రవీంద్ర, కృష్ణవంశీ

రణస్థలం: మండలంలోని దేరసాంలో ఉన్న భూములను రెవెన్యూ అధికారులు రవీంద్ర, వంశీకృష్ణ రైతులతో కలిసి మంగళవారం సర్వే చేశారు. ఈ భూముల రికార్డులను పరిశీలించారు. దేరసాంలో భూ సమస్యలతో ఎన్నో ఏళ్లుగా రైతులు, భూయజమానులు ఇబ్బందులు పడుతున్నారని పైడిభీమవరం పిఎసిఎస్ డైరెక్టర్ దన్నాన రవీంద్ర, ఎంపిటిసి దన్నాన వంశీకృష్ణ తెలిపారు. జిరాయితీ భూములు రికార్డులో ఎ-1గా నమోదు కావడంతో భూమి రికార్డుల్లో ప్రభుత్వాల నిబంధనలు ప్రకారం ఉంచారని అన్నారు. ఒకరకమైన సవరణ పత్రాలతో గుర్తింపు పొందిన భూములుగా, ఇవి సాధారణంగా వ్యవసాయం తెలియక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అవసరానికి అమ్ముకుందామంటే భూముల క్రయ విక్రయాలు కూడా జరిగేవి కాదని తెలిపారు. దీనిపై జిల్లా, మండల స్థాయి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

ముమ్మరంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు నష్టం కలుగుతుందని వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అధ్యక్షతన సంతబొమ్మాళిలో పిపిపికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కోసం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు విద్య, వైద్య సదుపాయాలు అందకుండా చేయడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని విమర్శించారు. ప్రతిఒక్కరూ సంతకాల సేకరణలో భాగస్వామ్యం కావాలని తిలక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాలు వసంతరెడ్డి, బుడ్డ మోహనరెడ్డి, కిల్లి అజయ్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చిలకపాలెం వద్ద ఉన్న వెంకటేశ్వర, శివానీ ఇంజినీరింగ్ కళాశాలల వద్ద మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు పూనుకుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, రాష్ట్ర బూత్ కమిటీల కార్యదర్శి జరుగుళ్ల శంకర్, నియోజకవర్గంలోని జెడ్‌పిటిసి, ఎంపిపి పాల్గొన్నారు.



పొందూరు : సంతకాలను సేకరిస్తున్న వైసిపి నాయకులు

పొందూరు: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను సేకరిస్తున్నామని ఆముదాలవలస వైసిపి ఇన్‌ఛార్జి చింతాడ ప్రసాద్ తెలిపారు. మండలంలోని బొడ్డేపల్లి, మొదలవలస, సింగూరు గ్రామాల్లో మంగళవారం రచ్చబండ నిర్వహించి సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో మండల వెసిపి అధ్యక్షులు కె.రమణమూర్తి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, చింతాడ ప్రసాద్, పైడి నాగభూషణ్, వి.సూరపునాయుడు. చంద్రమణి, కూన అమ్మినాయుడు. కె.సూర్యారావు, టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

నరసన్నపేట : మండలంలోని కొత్తపోలవలసలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యాన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, వైసిపి మండల అధ్యక్షులు లుకలాపు రవి పాల్గొన్నారు.

మందస : మండలంలోని రాంపురం పంచాయతీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సర్పంచ్ పొట్టి ధర్మారావు, వైసిపి మండడల అధ్యక్షులు దల్లి జానకిరెడ్డి సంతకాలను సేకరించారు.



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సభ్యులు

సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- అరసవల్లి

అరసవల్లి ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్న నిరాధార వ్యక్తి కళ్లేపల్లి రమేష్ కుమార్, కుమారుడు లీలసాయి కృష్ణ ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారు. కృష్ణ తల్లి సుజాత టైలరింగ్ వృత్తి చేస్తూ... వారిని పోషిస్తుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు రమేష్ కుటుంబానికి బియ్యం, కూరగాయలు, పండ్లు మంగళవారం అందించారు. లీలసాయి కృష్ణకు వైద్యానికి రూ.లక్ష అవసరమని, దాతలు ఫోన్ పే 9381442744 ద్వారా ఆర్థికసాయం అందజేయాలని సుజాత కోరారు. కార్యక్రమంలో సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు శిల్లా బాలకృష్ణ, పొడుగు చరణ్, ఉర్లాం శివతేజ పాల్గొన్నారు.



సంతకాలను సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓటు చోరీపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మంగళవారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన స్థానిక ఇందిరా గాంధీ చౌక్ వద్ద మంగళవారం ఓటు చోరీపై సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మధుసూదన్, తంగుడు వీర్రాజులు మాట్లాడుతూ ఓటు చోరీ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించు కుందని అన్నారు. దీని కోసం కోటి సంతకాలు సేకరణ చేపడుతున్నామన్నారు. పార్లమెంట్ కాంగ్రెస్ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఓట్ చోరీ ఎలా జరిగిందో ప్రజలకు రెండుసార్లు వివరించారని గుర్తు చేశారు.

అరసవల్లి సందర్శన

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణ ఆలయాన్ని మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ బాల కిరణ్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి ఘనంగా స్వాగతం పలికారు.

పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి : ఈ నెల 26న స్థానిక ఆల్ఫా జెన్ స్కూల్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి స్కూల్స్ ఓపెన్ చదరంగం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్‌డిఒ ఎం.కృష్ణ మూర్తి మంగళవారం ఆవిష్కరించారు. విద్యార్థి దశలో ఇటువంటి మెదడుకు పదును పెట్టే క్రీడ చదరంగమని ఆర్‌డిఒ అన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా సభ్యులు ఇప్పిలి అవినాష్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

అధిక దిగుబడులపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని లొద్దపుట్టి, బెల్లుపడలో వరి పంటలో అధిక దిగుబడులు సాధించడంపై వ్యవసాయాధికారులకు మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. పిఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం క్రింద రైతులకు 'వరిలో అధిక దిగుబడుల కోసం మేలైన యాజమాన్య పద్ధతులు' గురించి వివరించారు. రైతులకు పలు అంశాలపై సమగ్ర వివరణ ఇస్తూ అవగాహన కల్పించారు. దమ్ము దశలో భాస్వరం ఎరువు, డిఎపి వాడకం, కలుపు నియంత్రణ పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, చిరుపొట్టు దశలో పొటాష్ వినియోగం, సస్యరక్షణ చర్యలు, నివారణా సూచనలు చేశారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

అదేవిధంగా పెసర, మినుములు, నువ్వు పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడి ఎ.వెంకటరావు, ఆమదాలవలస శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్, ఎఒ అజయ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయక సంచాలకులు సోనియా, మల్లేషు పాల్గొన్నారు.

ఉద్యోగులను తొలగించడం అన్యాయం



సంఘీభావం తెలుపుతున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన తాగునీటి ప్రాజెక్టులో పనిచేస్తున్న 120 మంది ఉద్యోగులను నిర్లాక్ష్యంగా తొలగించడం అన్యాయమని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని జిల్లా సిపిఐ కార్యదర్శి చాపర వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్, తంగుడు వీర్రాజులు అన్నారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రారంభం నుంచి పనిచేస్తున్న ఉద్యోగులు ఉద్దానం ప్రాంతంలోని ప్రజలకు తాగునీటిని అందించే వారని చట్టవిరుద్ధం 120 మందిని విధుల నుంచి తొలగించడంతో కుటుంబ సభ్యులు చిన్నారులతో ఆకలి బాధలతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తొలగించిన ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పరిహారం అందజేత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక వి.కె.పేట ఎస్‌బిఐలో రూ.10 లక్షల ఇన్సూరెన్స్ పరిహారం మంగళవారం పంపిణీ చేశారు. మండపల్లికి చెందిన ఇసురు రాఘవరెడ్డి కుమారుడు ఇసురు ఉదయ్ స్టేట్ బ్యాంకులో ఖాతాదారుడు. ఎస్‌బిఐ జనరల్ పథకానికి రూ.500 ఆక్సిడెంట్ పాలసీ ప్రీమియం చెల్లించాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 4న హైదరాబాద్‌లో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నామినీ తమ్ముడు ఇసురు చందుకు రూ.10 లక్షలు బీమా పరిహారం చెక్కును ఎస్‌బిఐ జనరల్ ద్వారా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ నీలకంఠసాహు, డిప్యూటీ మేనేజర్ నాగరాజు, ఎస్‌బిఐ జనరల్ సిఎస్ ఎం.వెంకటగిరిబాబు, బిడిఎం సతీష్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

రామ్‌మనోహర్ నాయుడు పరామర్శ



పరామర్శిస్తున్న రామ్ మనోహర్ నాయుడు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని అలికాంకు చెందిన పేయ్యల సూర్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు మంగళవారం పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే గార మండలం అంపోలు సర్పంచ్ గొండు జయరాం అనారోగ్యంతో ఉన్నారని తెలుసుకొని ఆయనునూ పరామర్శించారు, మెదరవీధి, లోపింటి చిట్టిబాబు గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఆయననూ పరామర్శించారు. ఆయనతో పాటు రంధి పాపారావు, గొండు నీలాద్రి, కంచు గోవిందరావు, గుంటముక్కల పాపారావు, కర్నేణి హరి పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికపై అవగాహన

సరుబుజ్జిలి : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల వార్షిక ప్రణాళికపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లోని వివిధ విభాగాలకు చెందిన ప్రణాళికలను కార్యదర్శులు, వెలుగు సిబ్బంది రూపొందించారు. ప్రణాళికల వివరాలపై ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.పావని అన్ని శాఖల అధికారులకు వివరించారు. ఐకెపి ఎపిఎం గోవిందరాజులు, ఎఒ కె.మన్మథరావు, మండల పంచాయతీ అధికారి బి.రామారావు గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి, పశువైద్య అధికారి, మండల పరిషత్ సిబ్బంది ప్రసాదరావు, రమణబాబుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ పావని

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరంలోని కాలనీల ముంపు, మౌలిక వసతుల సమస్యలపై నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పట్టణ పౌర సంక్షేమ వేదిక కన్వీనర్ ఎం.గోవర్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించి భవిష్యత్ పోరాట కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రినాథ్

ఒడిఎఫ్ పంచాయతీలపై దృష్టి

ప్రజాశక్తి- కవిటి

బహిరంగ మలవిసర్జనరహిత పంచాయతీలుగా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ త్రినాథ్ సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా బహిరంగ మలవిసర్జ నిరోధించడంలో చాలా పంచాయతీలు వెనుకబడి ఉన్నట్టు తెలిపారు. ఇకపై కార్యదర్శులు ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా శానిటేషన్ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాల్లో కార్యదర్శులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సచివాలయ సిబ్బంది పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవి, రమాదేవి

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలోని కెజిబివిని జిసిడిఒ చదువుల మాధవి, ఎజిసిడిఒ రమాదేవి మంగళవారం సందర్శించారు. విద్యార్థుల అభ్యాసాలపై ప్రత్యేక దృష్టా పెట్టాలచాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్టడీ అవర్ నిర్వహణ, యోగా అభ్యాసాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులకు మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి తోడ్పడే యోగా అనుభవాన్ని బోధిస్తూ, విద్యాసంస్థల్లో అనుసరించాల్సిన నియమావళిని గుర్తు చేశారు. విద్యార్థుల చదువు ప్రగతిపై పాఠశాల సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయన చూపు సజీవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ



పురుషోత్తమరావు (ఫైల్)

శ్రీకాకుళం పట్టణానికి చెందిన కెవిి పురుషోత్తమరావు నేత్రదానం మరో ఇద్దరికి చూపుని ఇస్తుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జి.జగన్మోహనరావు అన్నారు. రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా ఆయన నేత్రాలను మంగళవారం సేకరించారు. విశాఖపట్నంలో ఉన్న ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు, నేత్రదానంపై అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రక్తదానం, నేత్రదానం, అవయవ దానం వంటి వి ఆపదలో ఉన్న వారికి ప్రాణదానంగా చెప్పారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటరావు

దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు

ఇచ్ఛాపురం : రేషన్‌కార్డు దారులతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వెంకటరావు, డిటి సంతోష్‌కుమార్ హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేశారు. ప్రతినెలా 26 నుంచి 30 వరకు వికలాంగులకు, వృద్ధులకు ఇంటింటికి వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. డిపో దగ్గరికి వచ్చే కార్డుదారులతో అమర్యాదగా ప్రవర్తించవద్దు సూచించారు. రేషన్ పంపిణీలో సాంకేతిక సమస్యలు వస్తే డిటి దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. సమావేశంలో మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.